సాక్షి
ములుగు
గురువారం । 27 । ఏప్రిల్ । 2023





## మైనర్‌కు బండి.. 'మేజర్' మిస్టేక్

పిల్లలకు వాహనాలిస్తే ఇక తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పవు. మైనర్లు వాహనాలు నడుపుతూ రోడ్డెక్కితే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు.

- 8లో▸



## డిజిటల్ టెక్నాలజీతో పెనుమార్పులు

సేవా, వ్యవసాయ పరిశ్రమల రంగాల్లో డిజిటల్ టెక్నాలజీతో పెను మార్పులు వచ్చాయని ఆచార్య మల్లికార్జున్‌రెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0$^0$ /24.0$^0$

## వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో వర్షం అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ములుగు డీఎస్పీగా రవీందర్



**ములుగు:** ములుగు డీఎస్పీగా నలువాల రవీందర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ గాష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. 2009బ్యాచ్‌కు చెందిన రవీందర్ గతంలో వెంకటాపురం(కె) సీఐగా విధులు నిర్వహించారని అనంతరం ఇంటలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం బదిలీపై ములుగు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ రవీందర్‌ను ఎస్పీ గాష్ ఆలం అభినందించారు.

### ధర్నాను జయప్రదం చేయండి



**ఏటూరునాగారం:** హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ ఆఫీస్ ఎదుట చేపట్టిన చలో లేబర్ కమిషన్ కార్యక్రమాన్ని, ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ. దావూద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ధర్నా వాల్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దావూద్, ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు మోకాళ్ల రంజిత్‌లు మాట్లాడుతూ తెలంగాణ అన్నివర్గాల హమాలి వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) పిలుపులో భాగంగా తరలిరావాలన్నారు. హమాలీ కార్మికులందరికీ భవన నిర్మాణ కార్మికుల వలె వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. 50 కిలోలకు మించిన బరువులు నిషేధించడంతో పాటు పని గంటలు, పని భద్రత, గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి హక్కులకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు ఎంపెల్లి రాంబాబు, వావిలాల నాగరాజు, దేపాక భాస్కర్, దేపాక చిన్న లక్ష్మయ్య, వావిలాల కృష్ణ, పడిదల లక్ష్మయ్య, చెన్నం రాజు, దేపాక సారయ్య, కుండ కుర్తి ఎల్లయ్య, నరసింగరావు పాల్గొన్నారు.

### అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

**కన్నాయిగూడెం:** అకాల వర్షాలతో పంటనష్టం జరిగి ఇబ్బందులు పడుతున్న రైతులకు ఎకరానికి రూ.50 పరిహారం అందించి ఆదుకోవాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు అబ్బు రమేష్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రైతులు వరి, మిర్చి పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### జెన్‌కో సీఎస్ఆర్ నిధులు విడుదల

**మల్హర్:** మండల పరిధిలోని తాడిచర్ల గ్రామానికి ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కృషితో జెన్‌కో సీఎస్ఆర్ ద్వారా రూ.30లక్షల నిధులు విడుదలైనట్లు కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ నుంచి చీఫ్ ప్లానింగ్ అధికారి ద్వారా తాడిచర్ల గ్రామానికి ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు రూ.20లక్షలు, మోడల్ బస్టాండ్ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. నిధుల విడుదలకు సహకరించిన శ్రీధర్‌బాబుకు గ్రామస్తుల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

### మహారాష్ట్ర రైతుల దీక్ష



**కాళేశ్వరం:** జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీబ్యారేజీ బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం చెల్లించాలని కొన్ని రోజులుగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ రైతులు కోరుతున్నారు. బుధవారం నిరవధిక దీక్షలను సిరొంచలో ప్రారంభించారు. కాగా అక్కడ 144 సెక్షన్ అమలు చేయడంతో గుంపులుగా కాకుండా నలుగురు రైతులు సిరొంచ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేట్టారు. అంతకు ముందు గ్రామంలో పుర వీధుల గుండా ర్యాలీగా నినాదాలు చేశారు. తమ హక్కుల సాధనకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని రైతు రాము రంగువార్ తెలిపారు.



| మండలం | వరి సాగు | దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|---|
| ములుగు | 7,023.33 | 6,504.826 |
| వెంకటాపురం(ఎం) | 6,176.29 | 14,514.282 |
| గోవిందరావుపేట | 10,118.06 | 23,777.441 |
| తాడ్వాయి | 3,237.10 | 7,607.185 |
| ఏటూరునాగారం | 4,883.01 | 11475.074 |
| కన్నాయిగూడెం | 493.23 | 1,159.090 |
| మంగపేట | 13,523.26 | 31,779.661 |
| వాజేడు | 2,531.35 | 5,948.672 |
| వెంకటాపురం(కె) | 869.23 | 2,042.808 |

# కొనుగోళ్లకు సిద్ధం

**జిల్లా వ్యాప్తంగా 147ధాన్యం కేంద్రాలు**

- 48,857 ఎకరాల్లో వరిసాగు
- దిగుబడి అంచనా 1.14లక్షల మెట్రిక్ టన్నులు

**ములుగు రూరల్:** రాష్ట్రం ప్రభుత్వం రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలోని తొమ్మిది మండలాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి యాసంగిలో (రబీ) రైతులు సాగు చేసిన వరి ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు సిద్ధమైంది. జిల్లాలో సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనాకు అనుకూలంగా కొనుగోలు కేంద్రా లను నెలాకరు వరకు ప్రారంభించనున్నారు.

జిల్లా వ్యాప్తంగా 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), గిరిజన సహకార సంఘం(జీసీసీ), మహిళా సంఘాలు (ఐకేపీ), రైతు సంఘాల నుంచి ప్రతి పాదనలు వచ్చాయి. ఇందులో 147 కేంద్రాలు మాత్రమే అనుమతులు పొందాయి. పీఏసీఎస్ 100 కేంద్రాలు, జీసీసీ 26 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 21 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో యాసంగి సాగు ఆలస్యం కావడంతో వచ్చే నెల మొదటి, రెండో వారంలో కోతలు ప్రారంభం కానున్నాయి. కోతలకు అనుగుణంగా అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

**గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా..**

జిల్లాలో యాసంగిలో 48,857 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. ఎకరాకు 23.5 క్వింటాల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో జిల్లాలో యాసంగి వరి ధాన్యం 1లక్ష 14 వేల 809 మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం శుద్ధి యంత్రాలు, తేమ మిషన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**నాణ్యత తప్పనిసరి**

వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు, కొనుగోలు దారులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలి. ధాన్యంలో 17శాతం తేమ, 1 శాతం తాలు, మచ్చ గింజలు లేకుండా ఉన్న వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్వాహకులకు సూచిస్తున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తేమ శాతం నిర్ధారణ చేసిన అనంతరం ధాన్యం కాంటాలు వేయాలని నిబంధనలు ఉన్నాయి.

**రైతులకు సౌకర్యాలు కల్పిస్తాం**

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తాం. గన్ని బ్యాగులు, ధాన్యం సరఫరాకు వాహనాలు, ఎలక్ట్రానిక్ కాంటాలు, హమాలీలను అందుబాటులో ఉంచుతాం. దిగుబడి అంచనా ప్రకారం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. అవసరమైతే కలెక్టర్ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలను పెంచుతాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేపడతాం.



- రాములు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

## పనులకు ప్రతిపాదనలు రూపొందించాలి

**కలెక్టర్ కృష్ణ ఆదిత్య**

**ములుగు:** మేడారం అభివృద్ధి పనులపై ముందస్తు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్‌తో కలిసి ట్రైబల్ వెల్ఫేర్, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో అభివృద్ధి పనులపై బుధవారం సమీక్షించారు. 2024లో నిర్వహించిన మేడారం జాతర అభివృద్ధి కార్యకలాపాలు, అభివృద్ధి పనులపై ముందస్తు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ అన్నారు. వరదల ప్రభావంతో జంపన్న వాగు కట్టపై నల్లాలు, దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణం కోసం ప్రతిపాదనలు రూపొందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా మంజూరైన రోడ్డు పనులు పెండింగ్‌లో లేకుండా పూర్తి చేయాలన్నారు. కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వార మంజూరైన రోడ్డు పనుల, గెస్ట్‌హౌజ్ పూర్తి చేయాలని కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. జాతర సమయంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా నూతన ఓహెచ్ఆర్ పైప్‌లైన్లకు ప్రతి పాదనలు పంపించాలన్నారు. సమీక్షా సమావేశంలో వివిధ శాఖల అధికారులతో నూతన ప్రతిపాధనలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రమాదేవి, జిల్లా వైద్యాధికారి అప్పయ్య, ఆర్‌డబ్ల్యూస్ ఈఈ మాణిక్యరావు, పంచాయతీ రాజ్ ఈఈ దిలీప్, ట్రైబల్ వేల్ఫేర్ ఈఈ హేమలత, డీడబ్ల్యూఓ ప్రేమలత, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, మేడారం సీఐ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

**ఓటరు జాబితా సిద్ధం చేయాలి**

**ములుగు:** ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పకడ్బందీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి రవికిరణ్ కలెక్టర్లకు సూచించారు. ఈ మేరకు కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ప్రతీ శుక్రవారం నాయకులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ కూతాటి రమాదేవి, డీటీ విజయ్ పాల్గొన్నారు.

## ఇసుక క్వారీ పరిశీలన

**కాళేశ్వరం:** మహదేవపూర్ మండల పరిధిలోని మద్దులపల్లి శివారులో గల బల్లాపూర్ వద్ద కుంట్లం-2 ఇసుక క్వారీని బుధవారం అదనపు కలెక్టర్ స్వర్ణలత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 15 రోజులుగా కుంట్లం-2 ఇసుక క్వారీకి పంట భూములు లీజుకు ఇచ్చిన రైతులకు సంబంధిత కాంట్రాక్టర్లు డబ్బులు ఇవ్వడం లేదని ఆందోళన బాట పట్టారు. దీంతో కలెక్టర్ భవేష్‌మిశ్రాకు తమకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన అదనపు కలెక్టర్ ఇసుక క్వారీ వద్దకు వచ్చి నేరుగా రైతులతో మాట్లాడగా రైతులు తమ గోడును విన్నవించారు. కుంట్లం-2 క్వారీ క్వాంటిటిని కొల్లూరుకు తరలించి మళ్లీ ఇక్కడి గోదావరి నుంచి ఇసుకను తరలించేందుకు కుట్ర చేస్తున్నారని రైతులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆమె వెంట తహసీల్దార్ మాధవి, పీఓ తారక్‌నాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం మద్దులపల్లిలోని బల్లాపూర్ గోదావరి నుంచి మంచిర్యాల జిల్లా కొల్లూరుకు యథేచ్ఛగా మట్టి రోడ్లు వేసి ఇసుకను తరలిస్తున్న విషయమై తీరం వరకు వెళ్లి పరిశీలించారు. మంచిర్యాల కు అక్రమంగా తరలించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటానని అదనపు కలెక్టర్ తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న జేసీ స్వర్ణలత

## అధికారుల పనితీరుపై ఆగ్రహం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కార్యదర్శుల రికార్డుల నిర్వహణపై అదనపు కలెక్టర్ సీరియస్
- 11మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశం

**మంగపేట:** మండల పరిధిలోని గ్రామ పంచాయతీల పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శుల రికార్డుల నిర్వహణ తీరును చూసి అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి(స్థానిక సంస్థలు) ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ తుల రవి అధ్యక్షతన అదనపు కలెక్టర్ త్రిపాఠి, డీపీఓ కొండ వెంకయ్య, గ్రామీణాభివృద్ధి అధికారి నాగపద్మజతో కలిసి రివ్యూ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీల కార్యదర్శుల వివరాలపై ఆరా తీశారు. సీసీరోడ్ల నిర్మాణంలో వీడీసీలు ఇవ్వకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు మండలంలోని గ్రామ పంచాయతీ నిర్వాహణ, అభివృద్ధి నిధుల వినియోగం, వీడీసీ తీర్మాణాలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అనంతరం తిమ్మంపేట, కోమటిపల్లి, కమలాపురం, చెరుపల్లి తదితర గ్రామ పంచాయతీల నిర్వహణ రికార్డులను ఆమె పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేక పోవడంతో పాటు రాత్రికి రాత్రి రికార్డులు సరిచేసినట్లు ఆమె గుర్తించారు. ఈ విషయాన్ని నిజాయతీగా ఒప్పుకుంటే మొదటి తప్పుగా భావించి చర్యలు ఉండవని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించడంతో నిజమేనని కార్యదర్శులు ఒప్పుకోవడం విశేషం.

**వీడీసీ తీర్మాన నిబంధనలపై ఆరా..**

ఏజెన్సీ ప్రాంతంలో పీసా నిబంధనలకు విరుద్ధంగా స్పెషలాఫీసర్ సంతకాలు లేకుండా వీడీసీలు ఎలా ఇచ్చారని, అసలు వీడీసీ తీర్మానం నిబంధనలు ఏమిటో తెలుసా అని ప్రశ్నించారు. కార్యదర్శుల నుంచి సరైన సమాధానం రాక పోవడంతో ఏమి తమాషాగా ఉందా.. విధుల్లో బాధ్యత లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కార్యదర్శులకు నోటీసులు**

కూలీలు రావడం లేదని కుంటి సాకులు చెప్పకుండా వారానికి ఒకసారి సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. కొత్తూరుమొట్లగూడెం, నర్సాయిగూడెం, తిమ్మంపేట, నిమ్మగూడెం, దోమెడ, నర్సింహాసాగర్, వాడగూడెం, రమణక్కపేట, తదితర జీపీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీపీఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, పీఆర్ ఏఈ పాడి వాసుదేవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ యాకన్న, ఈజీఎస్ ఏపీఓ చరణ్‌రాజ్, ఈసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా 'పీపుల్స్ మార్చ్'

**మడికొండ, ధర్మసాగర్‌లలో కొనసాగిన భట్టి పాదయాత్ర**

- రైల్వే జేఏసీ నాయకుల వినతిపత్రం అందజేత
- గౌడ కార్మికుడి సమస్యలు తెలుసుకున్న భట్టి విక్రమార్క
- తడిసిన ధాన్యం పరిశీలన.. అండగా ఉంటామని హామీ





భట్టి విక్రమార్కను కలిసిన రైల్వే జేఏసీ నాయకులు, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న భట్టి

**మడికొండ/ధర్మసాగర్:** సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర హనుమకొండ జిల్లాలో ఉత్సాహంగా సాగుతోంది. మంగళవారం రాత్రి మడికొండలో బస చేసిన భట్టి బుధవారం ఉదయం 8 నుంచి 10గంటల వరకు ప్రజలను, కార్యకర్తలను కలుసుకున్నారు. కాజీపేట రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కోకన్వీనర్లు అనుముల శ్రీనివాసు, జీ.భాస్కర్, ఎంకే.మూర్తి, ఎస్.లక్ష్మినారాయణలు భట్టి విక్రమార్కను కలిసి మెమోరాండం అందజేశారు. కాజీపేట వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమకు 160 ఎకరాలకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 150 ఎకరాల భూమి మాత్రమే రైల్వేకు అప్పగించిందని, మరో 10 ఎకరాల భూమిని ఇవ్వకపోవడంతో పరిశ్రమ నిర్మాణం ప్రారంభం కావడం లేదని తెలిపారు. దీనిపై భట్టి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కావాలని నాటకాలు ఆడుతూ రైల్వే పరిశ్రమపై నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్లుగా భూమి అప్పగించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

**మధ్యాహ్నం..**

మడికొండలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన ఆయన పాదయాత్రగా మధ్యాహ్నం వరకు ధర్మసాగర్ చేరుకున్నారు. ధర్మసాగర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ముప్పారం మీదుగా నారాయణగిరికి చేరుకున్నారు. మార్గమధ్యలో పలువురు రైతులు, కూలీలతో మాట్లాడుతూ ముందుకు సాగారు. అంతకుముందు ధర్మసాగర్‌లో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 54శాతం ఉన్న బీసీల అభ్యున్నతి కోసం సబ్‌ప్లాన్ చట్టం తీసుకువచ్చి బీసీబంధు పథకం తీసుకువచ్చే ఆలోచన చేస్తామన్నారు. కేజీ టు పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్యను అందిస్తామని, పేదలకు ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మొట్టమొదటిగా గెలిచేది స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గమేనని చెప్పారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆనాడు దేవాదుల ప్రాజెక్ట్ పనులు ప్రారంభించి ధర్మసాగర్ రిజర్వాయర్‌లో నీళ్లు పోయించారన్నారు. తెలంగాణలో పేదల బతుకులు మారలేదు కానీ బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, నాయకులు దొమ్మాటి సాంబయ్య, ఎర్రబెల్లి స్వర్ణ, బండ్రు శోభారాణి, గండ్ర సత్యనారాయణ, కూచన రవళి, తొట్ల రాజు యాదవ్, గంగారపు అమృతరావు, జగదీశ్‌రెడ్డి, గుర్రం అమర్‌నాథ్, వారల వెంకన్న, పెండ్లి కృష్ణమూర్తి, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, నాగరాజు, నీలం వేణు రజిని, కీసర దిలీప్‌రెడ్డి, గుర్రపు ప్రసాద్, ఎంపీటీసీలు రొండి రాజు, జాలిగపు వనమాల, బొడ్డు లెనిన్, జాలిగపు దుర్గయ్య పాల్గొన్నారు.

**మీలో మీరు తిట్టుకోకుండా ప్రజలకు ఉపయోగపడే పథకాలు పెట్టండి**

- భట్టి విక్రమార్కకు ఓ గీతకార్మికుడి సూచన

పాదయాత్రలో భాగంగా మడికొండ గ్రామానికి చెందిన గీతకార్మికుడు బైరి నాగరాజును.. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పలకరించారు. 'రాజకీయ నాయకులు మీలో మీరు తిట్టుకోవడం కాకుండా ప్రజలకు ఉపయోగకరమైన పథకాలను ప్రవేశపెట్టండి. చదువుకునే పిల్లలకు ఉచిత విద్య అందించేలా చర్యలు తీసుకోవాలి. పైచదువుల వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వెంటనే అమలు చేసేలా చూడండి' అంటూ నాగరాజు.. భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కకు తాటి ముంజలను అందజేశాడు.



పాదయాత్రలో గౌడ కార్మికుడు నాగరాజుతో భట్టి విక్రమార్క

## టీకాలతోనే వ్యాధులనుంచి రక్షణ

**వెంకటాపురం(ఎం):** వ్యాధుల భారిన పడకుండా ఉండాలంటే టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అన్నారు. ప్రపంచ సార్వత్రిక టీకాల వారోత్సవాల సందర్భంగా వైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ అప్పయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన చిన్నారులకు 24 గంటల్లోపు బర్త్ డోస్ ఇప్పించాలని సూచించారు. క్షయ వ్యాధి, హెపటైటిస్, పోలియో, విరేచనాలు, రోట వైరస్, మెన్ ఇంజైటీస్ వ్యాధి, డిఫ్తీరియా, కోరింత దగ్గు, టెటనస్, నిమోనియా, మీజిల్స్, రుబెల్లా మొదలగు వ్యాధుల నుంచి టీకాలు పిల్లల్ని రక్షిస్తాయని తెలిపారు. పిల్లల్లో మరణాలు సంభవించకుండా కాపాడుతాయని వివరించారు. పిల్లల తల్లిదండ్రులు బాధ్యతతో చిన్నారులకు ఏ సమయంలో వేయించే టీకాలు అదే సమయంలో వేయించాలని సూచించారు. అనంతరం డాక్టర్ విపిన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఇమ్యునైజేషన్ ఆఫీసర్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. డ్రాపౌట్ ఉన్నటువంటి పిల్లలను గుర్తించాలని, డ్యూలిస్ట్ ప్రకారంగా టీకాలు ఇప్పించాలన్నారు. కోడ్ చైన్ సిస్టం పాటించాలని, ఓపెన్ వైల్ పాలసీని ప్రతిఒక్కరూ విధిగా బాధ్యతగా పాటించాలన్నారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పిల్లలను సంఖ్య నమోదు చేసుకోవాలన్నారు. ప్రతీ బుధ, శనివారము సంవత్సరం లోపు వారిని టీకాల కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు గ్రామ సర్పంచ్ మేడబోయిన అశోక్, వైద్యాధికారులు రిషిత, మహబూబ్ పాషా, జిల్లా కార్యాలయ సిబ్బంది తిరుపతయ్య, సీహెచ్ఓ దుర్గారావు, సంపత్ రావు, సదానందం, హెచ్ఈ సంపత్, పీహెచ్ఎన్ శోభ, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

## సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష

**భూపాలపల్లి అర్బన్:** భూపాలపల్లి ఏరియాలోని వివిధ గనుల్లో పని చేస్తున్న కార్మికుల సంక్షేమ కార్యక్రమాలపై గని సంక్షేమ అధికారులతో డీజీఎం(పర్సనల్) తుకారాం బుధవారం సమీక్ష నిర్వహించారు. కార్మికులకు రావాల్సిన ప్రమోషన్లు, టర్మినల్ బెనిఫిట్స్, కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేసే ప్రక్రియ, రామప్ప కాలనీలో నూతనంగా నిర్మించిన సింగరేణి క్వార్టర్ల కేటాయింపులపై చర్చించారు. అర్హులైన వారందరిని గుర్తించి ప్రమోషన్లు వర్తింప చేయాలని డీజీఎం సూచించారు. నూతన క్వార్టర్లకు కేటాయింపు అర్హులైన ఉద్యోగులను దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎం శివకేశవరావు, సీనియర్ పీవోలు శ్యాంప్రసాద్, క్రాంతికుమార్, సూపరింటెండెంట్ సంజీవరావులు పాల్గొన్నారు.

## పంట నష్టం పరిహారం అందించాలి

**వెంకటాపురం(ఎం):** అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు భూక్య జవహర్ లాల్, ములుగు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావుతో కలిసి మండల పరిధిలోని బూరుగుపేట, తిమ్మాపూర్, బావ్‌సింగ్‌పల్లి, పెద్దాపూర్ గ్రామాల్లో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం పంట నష్టపోయిన రైతులు వేల్పుల వెంకటయ్య, అక్కేటి తిరుపతి రెడ్డి, ఆకుల లింగయ్య, అంబాల రాజు తదితరులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం మాట్లాడారు. అకాల వర్షాలతో వేలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని, మిర్చి, పుచ్చ, మొక్కజొన్న సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పకడ్బందీగా సర్వేలు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరి గౌడ్, తక్కెళ్లపల్లి సుమన్ రావు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంబడి విజేందర్ పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

## క్లుప్తంగా

### భార్యకు అబార్షన్ చేశారని ఆందోళన

రామన్నపేట: తనకు తెలియకుండా తన భార్యకు అబార్షన్ చేశారని భర్త బుధవారం వరంగల్‌లోని క్యూర్ వెల్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశాడు. ఖిలావరంగల్ ప్రియతో కరీమాబాద్‌కు చెందిన అరవింద్‌కు వివాహం జరిగింది. ఈక్రమంలో ప్రియ గర్భం దాల్చింది. మూడ్రోజుల క్రితం అనారోగ్య పరిస్థితుల నేపథ్యంలో క్యూర్‌వెల్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యింది. వైద్యురాలు హేమ పూర్తిస్థాయిలో పరీక్షించి ప్రియను 20 వారాల గర్భవతిగా గుర్తించింది. గర్భస్రావంలోని పిండం బయటకు వచ్చే పరిస్థితులున్న నేపథ్యంలో పిండాన్ని తొలగించారు. కాగా.. తనకు తెలియకుండానే అబార్షన్ చేశారని అరవింద్, అతడి కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. అరవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

### సీపీఐ నాయకులపై కేసు

వరంగల్ క్రైం: అక్రమంగా ప్రైవేట్ వ్యక్తుల భూములను ఆక్రమించినందుకు సీపీఐ నాయకులు బస్సు రవీందర్, కండే నరసయ్య, జన్ను రమేశ్, ఎండి అంజాద్‌పాషాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ జీ తెలిపారు. పెద్దమ్మగడ్డ శివారు నిమ్మయి చెరువు దగ్గరలో పట్టాదారుల భూముల్లో వేసిన గుడిసెలు తొలగించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ లెక్క చేయకుండా వ్యవహరించడంతో పాటు రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్లు రేకులపల్లి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

### డిగ్రీ పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్: కేయూ పరిధి డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ బీఏ(ఎల్) కోర్సుల నాలుగో, ఆరో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్ షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ విడుదల చేశారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 18, 20, 23, 25, 30, జూన్ 1, 3, 6, 8, 12, 14, 15, 16, 17, 19 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 19, 22, 24, 29, 31, జూన్ 2, 5, 7, 9, 13 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.




ఈనెల 15న కాజీపేట పట్టణంలో ద్విచక్రవాహనాలు నడుపుతూ పట్టుబడిన 8 మంది బాలల్ని పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి రెండ్రోజులు జువైనల్ హోమ్‌కు తరలించాలని తీర్పునిచ్చారు.

ఈనెల 21న కాజీపేట పట్టణంలో వాహనాల తనిఖీల్లో ఏడుగురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చి జువైనల్ హోమ్‌కు తరలించారు.

# మైనర్‌కు బండి.. 'మేజర్' మిస్టేక్

**పిల్లలకు వాహనాలిస్తే జైలుకే..**
- లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరం
- కమిషనరేట్‌లో 91 మంది జువైనల్ హోమ్‌కు
- మూడు నెలల్లో వందకు పైగా కేసులు నమోదు

ఫ్రెండు వాళ్లింటికెళ్లొస్తానని.. కూరగాయలు తీసుకొస్తానని అడిగినా.. లేదా మీరే మరేదో పని అప్పజెప్పి పిల్లలకు వాహనాలిస్తున్నారా? అయితే జాగ్రత్త.. మీరూ ఊచలు లెక్కపెడతారు. వరంగల్ కమిషనరేట్ పోలీసులు ట్రాఫిక్ నిబంధనల్ని పక్కాగా అమలు చేస్తున్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే ఏ1గా వాహన యజమానిని, ఏ2గా పట్టుబడిన మైనర్‌ను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు.
- వరంగల్ క్రైం


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)

పిల్లల సంతోషం, సరదా కోసం వాహనాలిస్తున్న తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పవు. మైనర్లు వాహనాలు నడుపుతూ రోడ్డెక్కితే వరంగల్ కమిషనరేట్ పోలీసులు కేసులు నమోదు చేసి జువైనల్ హోమ్‌కు తరలిస్తున్నారు. ఈడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు సుమారు 144 మంది మైనర్లపై కేసులు నమోదు చేశారు. అందులో 91 మందిని ఇప్పటికే అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించారు. మరో 53 మందిని అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించే పనిలో పోలీసులు ఉన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 20 శాతం ప్రమాదాలు మైనర్లు వాహనాలు స్పీడ్‌గా, అజాగ్రత్తగా నడపడం కారణంగా జరిగినట్లు పోలీసు అధికారుల సమీక్షలో తేటతెల్లమైంది. వేసవి సెలవుల్లో మైనర్లు వాహనాలు నేర్చుకోవాలని, పూర్తిగా నేర్చుకోకముందే రోడ్డెక్కి రైడింగ్ చేయాలనే ఆలోచనతో తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. కానీ పిల్లల ఒత్తిడికి లోనై వాహనాలను వారి చేతికిస్తే వారి భవిష్యత్ ప్రమాదంలో పడే అవకాశం ఉంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారిలో మైనర్లు ఎక్కువ మంది ఉండడం దురదృష్టకరం. ప్రమాదంలో గాయపడిన ఇతరులకు కూడా తీవ్ర నష్టం కలుగుతుంది. ప్రమాదాల కారణంగా పలు కుటుంబాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి.

**లైసెన్స్ లేకుండా రోడ్డెక్కితే ప్రమాదమే..**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్డెక్కిన మైనర్లు హనుమకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈఏడాది 43 మంది పట్టుబడ్డారు. వరంగల్‌లో 69 మంది పట్టుబడగా.. కాజీపేటలో 32 మందిపై కేసులు నమోదయ్యాయి. ఇందులో 91 మందిని అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించారు. మరో 53 మంది అరెస్ట్ కావాల్సి ఉంది. దీంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్డెక్కిన 1,755 మందికి రూ.1,25,02,700 జరిమానా విధించారు. గతేడాది కమిషనరేట్ పరిధిలో నమోదైన మైనర్ డ్రైవింగ్ కేసులు హనుమకొండ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 209 కేసులు నమోదు కాగా.. రూ.1,04,500 జరిమానా విధించారు. వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 280 కేసులకు రూ.1,40,000, కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 305 కేసులకు రూ.1,52,500 జరిమానా విధించారు. మొత్తం 794 కేసులు నమోదు కాగా.. వాటికి రూ. 3,97,000 జరిమానా విధించారు.

**పిల్లలు అడిగినా వాహనాలివ్వొద్దు..**

పిల్లలపై తల్లిదండ్రులకు ఉన్న అమితమైన ప్రేమ కారణంగా పిల్లలు అడిగిన వెంటనే తల్లిదండ్రులు వారికి బండ్లు ఇస్తున్నారు. దీని వల్ల వారు తెలిసీ తెలియని వయసులో ఎమోషన్స్‌తో స్పీడ్‌ను థ్రిల్‌గా భావించి ప్రమాదాలకు కారణమై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మైనర్లకు వాహనాలిచ్చిన తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తాం. వాహనాల ఓనర్ ఏ1గా ఉంటే.. మైనర్ ఏ2గా ఉంటాడు. వేసవి సెలవుల్లో ట్రాఫిక్ పోలీసులు అడుగడుగునా వాహనాలు తనిఖీలు చేస్తారు. పట్టుపడితే శిక్ష తప్పదు.
- ఏవీ.రంగనాథ్, సీపీ

**మైనర్ డ్రైవింగ్ కేసుల వివరాలు జనవరి 1నుంచి ఏప్రిల్ 24 వరకు**

| పోలీస్‌స్టేషన్ | కేసులు | జువైనల్ హోమ్‌కు వెళ్లినవారు | పెండింగ్ |
|---|---|---|---|
| హనుమకొండ | 43 | 30 | 13 |
| వరంగల్ | 69 | 40 | 29 |
| కాజీపేట | 32 | 21 | 11 |
| మొత్తం | 144 | 91 | 53 |

**డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులు జనవరి 1 నుంచి ఏప్రిల్ 24 వరకు**

| స్టేషన్ | కేసులు | జరిమానా | పెండింగ్ కేసులు |
|---|---|---|---|
| హనుమకొండ | 624 | రూ.5,84,400 | 195 |
| వరంగల్ | 642 | రూ.4,87,270 | 213 |
| కాజీపేట | 489 | రూ.1,78,600 | 178 |
| మొత్తం | 1755 | రూ.12,50,270 | 586 |

**గతేడాది మైనర్ డ్రైవింగ్ కేసులు**

| పోలీస్ స్టేషన్ | కేసులు | జరిమానా |
|---|---|---|
| హనుమకొండ | 209 | రూ.1,04,500 |
| వరంగల్ | 280 | రూ.1,40,000 |
| కాజీపేట | 305 | రూ.1,52,500 |
| మొత్తం | 794 | రూ.3,97,000 |

## పరదా కప్పలేదన్నందుకు ప్రాణం తీసుకుంది!

ఎల్కతుర్తి: 'వర్షం పడింది. పరదా ఎందుకు కప్పలేదు. ధాన్యమంతా తడిసిపోయింది' అని భర్త మందలించడంతో మండలంలోని దామెర గ్రామానికి చెందిన ఆవుల ఎల్లమ్మ(45) బుధవారం ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వడ్లు తడిసిపోయాయి. పరదా ఎందుకు కప్పలేదు అని ఎల్లమ్మను సమ్మయ్య మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఎల్లమ్మ ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు ఆమెను 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై జక్కుల పరమేశ్ కేసు నమోదు చేసుకున్నారు.



## పాము కాటుతో రైతు మృతి

ఎల్కతుర్తి: పాము కాటుతో మండలంలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన రైతు జక్కుల రాజయ్య(52) బుధవారం మృతి చెందాడు. రాజయ్య తన ఇంటికి కొద్ది దూరంలో మక్క ధాన్యం ఆరబోశాడు. మంగళవారం కురిసిన వర్షానికి కంకిని కుప్పనూర్చి వాటిపై పరదా కప్పి వెళ్లాడు. మరుసటి రోజు బుధవారం వచ్చి కంకిపై కప్పిన పరదాను తీస్తున్న క్రమంలో పరదలోంచి వచ్చిన నాగుపాము రైతును కాటేసింది. రాజయ్య పాము కరిచిందని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అతడిని 108లో ఎంజీఎంకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో ఆయన మృతి చెందాడు. రాజయ్య భార్య కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.

## గుండెపోటుతో ఉపాధ్యాయుడు..

మరిపెడ రూరల్: మండలంలోని తండా ధర్మారం గ్రామానికి చెందిన గుగులోతు ధర్మానాయక్ (55) గుండెపోటుతో మంగళవారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మృతి చెందారు. ధర్మానాయక్ సిద్దిపేట జిల్లా చెర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధడుతూ చికిత్స పొందుతూ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు.


ధర్మానాయక్ (ఫైల్)

## రైల్లోంచి జారి పడి యువకుడు..

కాజీపేట రూరల్: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా జగన్నాథపురం గ్రామానికి చెందిన ముంగర శివనాగు(21) మృతి చెందాడు. కాజీపేట జీఆర్పీ ఎస్ఐ సీహెచ్.పరుశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. శివనాగు (21) కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో అంప్రెంటీస్ ట్రైనీగా గతేడాది జూన్ నుంచి పని చేస్తున్నాడు. మంగళవారం రాజమండ్రిలో రాజమండ్రి–కాజీపేటకు టికెట్ తీసుకుని విశాఖపట్నం–కాచిగూడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. కాజీపేట–పెండ్యాల మధ్య కిలోమీటర్ నంబర్ 321/75 వద్ద ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మృతుడు శివనాగు మృతిపై ఎలక్ట్రిక్‌షెడ్ అధికారులు, రైల్వే నాయకులు, కార్మికులు, తోటీ అంప్రెంటీస్‌లు సంతాపం ప్రకటించారు.


శివనాగు(ఫైల్)

## డిజిటల్ టెక్నాలజీతో పెనుమార్పులు

- కేయూ యూజీసీ కో–ఆర్డినేటర్ ఆచార్య మల్లికార్జున్‌రెడ్డి
- ముగిసిన జాతీయ సదస్సు


మాట్లాడుతున్న కేయూ యూజీసీ కో–ఆర్డినేటర్ ఆచార్య ఆర్.మల్లికార్జున్‌రెడ్డి

కేయూ క్యాంపస్: సేవా, వ్యవసాయ పరిశ్రమల రంగాల్లో కూడా డిజిటల్ టెక్నాలజీతో పెనుమార్పులు సంభవించాయని కాకతీయ యూనివర్సిటీ యూజీసీ కో–ఆర్డినేటర్ ఆచార్య ఆర్.మల్లికార్జున్ రెడ్డి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో రెండ్రోజులుగా 'సోషల్ ఎకనామిక్ ఇంప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బుధవారం సాయంత్రం ముగిసింది. ఈముగింపు సభలో కేయూ యూజీసీ కో–ఆర్డినేటర్ ఆచార్య ఆర్.మల్లికార్జున్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎక్కువగా చదువుకోనివారు సైతం ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్స్ చేస్తున్నారన్నారు. దీని వల్ల బ్యాంకుకు వెళ్లి క్యూ కట్టాల్సిన అవసరం లేకుండా పోయిందని పేర్కొన్నారు. సరళమైన పద్ధతిలో ఈజీ డ్యూయింగ్ కరెన్సీ లెస్ పద్ధతిలో బ్యాంకింగ్ సేవలు కొనసాగుతున్నాయన్నారు. అన్ని రంగాలకు టెక్నాలజీ ఒక గేమ్ ఛేంజర్‌గా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈసదస్సులో ఆ కళాశాల ప్రిన్సిపాల్, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ అమరవేణి, రీసోర్స్ పర్సన్‌లుగా ఆచార్యులు రవిచంద్ర, వీరయ్య, అధ్యాపకులు రాజేశ్, డాక్టర్ బైరు నిరంజన్, డాక్టర్ రవీందర్ డాక్టర్ మంజుల, డాక్టర్ రమ పాల్గొన్నారు.

## రైల్వే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బద్దియ్య


కాజీపేట రైల్వే ఈఈ బద్దియ్య

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డిప్యూటీ కన్‌స్ట్రక్షన్ కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా బద్దియ్య అజ్మీర (ఐఆర్ఎస్ఈ)ను సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులు నియమించారు. కాజీపేట రైల్వే కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈఎన్)గా పనిచేస్తున్న బద్దియ్య అజ్మీరను రైల్వే ఉన్నతాధికారులు ఈఈగా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడే నియమించారు.

**ఈనెల 30 వరకు మూసివేత**

కాజీపేట సబ్ డివిజన్ పరిధి కోమటిపల్లి రైల్వే గేట్ నంబర్–2ను ఈనెల 30 వరకు మూసివేస్తున్నట్లు బుధవారం రైల్వే అధికారులు తెలిపారు. కోమటిపల్లి రైల్వే గేట్ రెండు వైపులా డ్రెయినేజీ మరమ్మతు పనుల కారణంగా ఈగేట్‌ను మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. వేరే దారిమీదుగా ప్రజలు రాకపోకలు చేసి రైల్వేకు సహకరించాలని వారు కోరారు.

# గ్యాస్ స్టౌ రిపేర్ పేరిట చోరీలు

- క్రైం ఏసీపీ డేవిడ్‌రాజ్


నిందితుల అరెస్టు చూపుతున్న క్రైం ఏసీపీ డేవిడ్‌రాజ్

వరంగల్ క్రైం: గ్యాస్ స్టౌ మరమ్మతుల ముసుగులో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడితో పాటు చోరీ సొత్తును తాకట్టు పెట్టుకున్న మరో ఇద్దరు నిందితులను సీసీఎస్, దామెర పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.2.20 లక్షల విలువైన 21.5 గ్రాముల బంగారం, 220 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.15 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథ్‌పల్లి గ్రామానికి చెందిన పర్వతం రాజు కొంతకాలంగా గ్యాస్ స్టౌ రిపేర్ చేస్తామని బైక్‌పై ఊళ్లలో తిరుగుతూ ఒంటరి మహిళలను గుర్తించేవాడు. వారికి సబ్సిడీపై గ్యాస్ ఇప్పిస్తామని, దాని కోసం ఆధార్ తీసుకురావాలని.. అవెంటనే మహిళలను అనుసరించేవాడు. ఇంట్లో బంగారం, వెండి చోరీకి పాల్పడి పరారయ్యేవాడు. దీంతోపాటు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి వేళల్లో ఇళ్లలో చోరీకి పాల్పడేవాడు. ఐదేళ్లుగా రాచకొండ, సైబరాబాద్, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడి పలుసార్లు జైలుకు వెళ్లాడు. జైలు నుంచి విడుదలైన రాజు ఈనెల 2న దామెర పోలీస్‌స్టేషన్ పరిధి కంఠాత్మకూరులో ఓ వృద్ధురాలికి గ్యాస్ స్టౌ ఇప్పిస్తానని, ఫొటో దిగాలని, మెడలో నుంచి బంగారు గొలుసు తీసేయాలని చెప్పాడు. నమ్మిన ఆమె గొలుసును అల్మారాలో పెట్టింది. ఆతర్వాత ఆమె కళ్లుగప్పి బంగారు గొలుసును తీసుకుని పారిపోయాడు. రాజు ఇలా.. వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఆరు చోరీలకు పాల్పడ్డాడు. తాళం వేసి ఉన్న ఏడు ఇళ్లలో తాళం పగులగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. పర్వతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, ధర్మసాగర్, రాయపర్తి, పరిధిలో రెండు చొప్పున, దామెర, ఐనవోలు, దేవరుప్పుల, మామునూరు, స్టేషన్‌ఘన్‌పూర్, ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒకటి చొప్పున చోరీలకు పాల్పడ్డాడు. చోరీ సొత్తును ఆలేరు మండలం, టంగుటూరు ప్రాంతానికి చెందిన చింతకింది రాములు ద్వారా యాదాద్రి జిల్లా ఆలేరు మండల కేంద్రానికి చెందిన గోవింద్ చౌదరి వద్ద తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నాడు. గ్యాస్ స్టౌ మరమ్మతులో భాగంగా దామెరకు వచ్చిన నిందితున్ని దామెర క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకుని విచారించారు. నేరం అంగీకరించి, తాకట్టు వివరాలు చెప్పడంతో చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం ఏసీపీ డేవిడ్‌రాజ్ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులను సీపీ రంగనాథ్ అభినందించినట్లు ఆయన తెలిపారు.

## టీచర్ కుటుంబానికి పీఆర్టీయూ చేయూత

- రూ 9.34 లక్షలు ఆర్థికసాయం


చెక్కు అందిస్తున్న పీఆర్టీయూ నాయకులు

విద్యారణ్యపురి: కేవలం ఉపాధ్యాయుల సమస్యల సాధనే కాదు, ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా సమస్యలు, ఆపద వచ్చినా.. పీఆర్టీయూ అండగా నిలిచి చేయూతనిస్తుందని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. యూనియన్ హనుమకొండ జిల్లా నడికూడ మండల శాఖ ప్రధాన కార్యదర్శి అచ్చ సుదర్శన్ కుమారుడు నేతాజీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి కోమాలోకి వెళ్లాడు. అతడిని రక్షించేందుకు, ఆస్పత్రి ఖర్చుల కోసం పీఆర్టీయూ టీఎస్ హనుమకొండ జిల్లా శాఖ నడికూడ, పరకాల మండల శాఖల ఆధ్వర్యంలో పీఆర్టీయూ ఉపాధ్యాయుల నుంచి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించారు. సేకరించిన మొత్తం రూ.9,34,910ను చెక్కు రూపంలో బుధవారం పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరి హనుమకొండలో బాధిత ఉపాధ్యాయుడు అచ్చ సుదర్శన్‌కు అందించారు. ఈసందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఎలాంటి కష్టం వచ్చినా పీఆర్టీయూ అండగా ఉంటుందన్నారు. గతంలో కూడా ఎంతోమంది ఉపాధ్యాయులకు ఆపద వస్తే ఆదుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరి, బాధ్యులు ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, తిరుపతిరావు, ఎ.శ్రీనివాస్, బండ రమేశ్, ఆర్.భానుప్రసాద్‌రెడ్డి, గైరిశెట్టి శ్రీధర్, రాజేందర్‌బాబు, రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, లక్షణాచారి ఇతర బాధ్యులు పాల్గొన్నారు.

## చేపలు పట్టేందుకు కూలీగా వెళ్లిన సర్పంచ్



గార్ల: గత 13 నెలలుగా గ్రామ పంచాయతీకి నిధులు రాలేదు. పంచాయతీలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాలేదు. పంచాయతీకి చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక గార్ల మండలం మద్దివంచ సర్పంచ్ కుసిని బాబూరావు బుధవారం చేపలు పట్టే కూలీగా వెళ్లాడు. గార్ల మండలం మద్దివంచ పంచాయతీలో న్యూడెమోక్రసీ పార్టీ తరపున సర్పంచ్‌గా బాబూరావు గెలిచాడు. గ్రామంలో అభివృద్ధి పనుల కోసం అప్పులు తెచ్చాడు. బిల్లులు రాక మిత్తి కట్టలేక ఇబ్బందులు పడుతున్నాడు. కాగా.. 'న్యూడెమొక్రసీ నుంచి సర్పంచ్‌గా గెలవడం తాను చేసిన పాపమా? స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ తన కోటా ద్వారా పంచాయతీకి అభివృద్ధి నిధులు సైతం కేటాయించడం లేదు' అని ఇదివరకు ఆయన విలేకరుల ఎదుట పలుమార్లు వాపోయాడు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి తమ పంచాయతీకి పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేసి, చేసిన అప్పులు తీరేలా తనను కాపాడాలని సర్పంచ్ వేడుకుంటున్నాడు.

## రైతాంగాన్ని ఆదుకునేదెప్పుడు?



మాట్లాడుతున్న ప్రొఫెసర్ యాదగిరిచార్యులు

వరంగల్ చౌరస్తా: అకాల వర్షాలతో రైతాంగం అతలాకుతలమైందని, ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.పదివేలను నేటికీ అందించకపోవడం విడ్డూరంగా ఉందని సామాజిక ఆర్థిక విశ్లేషకులు, ప్రొఫెసర్ ఎం.యాదగిరాచార్యులు విమర్శించారు. బుధవారం వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో అఖిల భారత రైతు సమైక్య (ఏఐకేఎఫ్), అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్), తెలంగాణ రైతు సంఘం, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు పూర్తిగా దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ప్రతీ రైతు ఎకరాకు పంట ఆధారంగా రూ. 10వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్, జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు, నాయకులు ఎస్ రెడ్డి హంసారెడ్డి, వివిధ రైతు ప్రజా సంఘాల నాయకులు నర్ర ప్రతాప్ కంకణాల మల్లికార్జున్ కందికొండ కుమారస్వామి గూడ సురేశ్, ఇనుముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజు కనిపించని ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం

- విరమిస్తున్నట్లు సంఘాల నేతల ప్రకటన
- మొదటి రోజు సమ్మె చేసిన 48 మంది టర్మినేషన్

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండోరోజు మంగళవారం విద్యుత్ ఆర్టిజన్‌ల సమ్మె ప్రభావం ఏమాత్రం కనిపించలేదు. పైగా తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్, ఇత్తెహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సమ్మెను విరమిస్తున్నట్లు హైదరాబాద్‌లో ప్రకటించారు. కాగా.. టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో మొదటిరోజు సమ్మెలో పాల్గొన్న 48 మందిని టర్మినేట్ చేశారు. ఎస్మా భయంతో పాటు ఆర్టిజన్లు వివిధ ప్రధాన సంఘాల్లో ఉండడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సమ్మెకు వెళ్లేందుకు ఆర్టిజన్లు ముందుకు రాలేదు. వివిధ కారణాలతో రెండ్రోజుల్లోనే సమ్మె ముగిసింది.

## ద్విచక్ర వాహనాల చోరీపై విచారణ

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గుర్రాలకుంట పంచాయతీ పరిధి టేకులతండాలో ద్విచక్ర వాహనాల చోరీపై ఖమ్మం పోలీసులు బుధవారం విచారణ జరిపారు. కొద్దిరోజుల క్రితం ఖమ్మంలో ఓ వ్యక్తిని అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. సదరు వ్యక్తి పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. టేకులతండాలో చోరీ చేసిన వాహనాలను విక్రయించినట్లు చెప్పడంతో ఐదు రోజుల క్రితం ఖమ్మం పోలీసులు నిందితుడిని తండాకు తీసుకొచ్చి విచారణ జరిపారు. వాహనాలను కొనుగోలు చేసిన వారు స్వచ్ఛందంగా నాలుగు రోజుల్లో పోలీసులకు స్వాధీనపర్చాలని పోలీసులు తండావాసులను కోరారు. బుధవారం నాలుగు వాహనాలను ప్రధాన రహదారి వద్ద తండాకు చెందిన వారు వదిలి వెళ్లగా.. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని ఖమ్మం తరలించారు.

**ఏపీ రిజిస్ట్రేషన్లు**

పోలీసులు స్వాధీనపర్చుకున్న నాలుగు స్ప్లెండర్ బైక్‌లకు ఏపీ రిజిస్ట్రేషన్ నంబర్లున్నాయి. టేకుల తండాతో పాటు రామకుంట తండా, వెన్నారంలోనూ ఏపీ రిజిస్ట్రేషన్ వాహనాలు తిరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొంతమంది వ్యక్తులు నిందితుడి వద్ద చోరీ వాహనాలు కొనుగోలు చేసి వాటి ద్వారా నాటుసారా సరఫరా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఎక్సైజ్ పోలీసులు నాటుసారాతో వెళ్తున్న ఏపీ రిజిస్ట్రేషన్ వాహనాలను పట్టుకుని సీజ్ చేసినట్లు టేకుల తండావాసులు చెబుతున్నారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపితే చోరీకి గురైన వాహనాలు ఈ ప్రాంతంలో మరిన్ని దొరికే అవకాశాలున్నట్లు స్థానికులు చెబుతున్నారు.